క్లుప్తంగా

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన



చెత్తకుప్పల తొలగింపు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శనివారం పలు వార్డుల్లో పర్యటించారు. తడి, పొడి చెత్త తొలగింపు, రోడ్లు, ప్రధాన కూడళ్లల్లో చెత్తను ఎత్తివేయడం, కాలువల్లో పూడికను తీసే పనులను పరిశీలించారు. పాత బస్టాండు, ప్రభాకర్ టాకీస్ రోడ్డు, శక్తిగుడి, పీఎస్ రోడ్, పాత బస్టాండు, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఎస్‌బీజీ నగర్, మున్సిపల్ మెయిన్ రోడ్డు, అన్న క్యాంటీన్‌లను ఆయన తనిఖీ చేశారు. భోజనం, అల్పాహారం నాణ్యతగా ఉన్నాయా, వడ్డిస్తున్నారా లేదానని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



మగ్బుల్‌హుసేన్



అశ్విని

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు అశ్విని, మగ్బుల్‌హుసేన్ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం ఇందిరాదేవి తెలిపారు. శనివారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌నకు విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి నెలకు రూ.1000 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు రూ.48 వేలు దాకా వస్తుందన్నారు.



రేహాన్



స్నేహలత

గోనెగండ్ల : నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)నకు గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షాహానా పర్వీన్ శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న రేహాన్, స్నేహలతలు ఉత్తమమైన ప్రతిభను కనపరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను, వీరి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.


డెంగీ కేసు నమోదు



హెచ్. కైరవాడిలో డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గోనెగండ్ల : మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామంలో ఐదేళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. శనివారం వైద్య సిబ్బంది హెచ్. కై రవాడి గ్రామానికి వెళ్లి పంచాయతీ సిబ్బందితో కలిసి నివారణ చర్యలు చేపట్టారు. డెంగీ కేసు నమోదైన బాలుడి ఇంటి పరిసరా ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల మందును పిచికారీ చేయించారు. పరిసరా ప్రాంతాల్లో పర్యటించి గ్రామస్తులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ పర మేశప్ప, భారతి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోండి



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

గోనెగండ్ల : జీవనోపాధి కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గోనెగండ్ల ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 50 యూనిట్లకు గాను 596 మంది దరఖాస్తు చేసుకోగా 230 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మధు మనోహర్, సీబీఓ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రుణ దరఖాస్తుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: బీసీ కార్పొరేషన్ కింద రుణాల కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను సోమవారం నుంచి సచివాలయాల వారీగా పరిశీలన చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శనివారం తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారం, ఆధార్, పాన్ కార్డు, కులధ్రువీకరణ సర్టిఫికెట్, బ్యాంక్ పాస్ బుక్ నకళ్లతో ఆయా సచివాలయాల్లో హాజరుకావాలన్నారు.

ఇసుకాసురులు!

- పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా
- నాగలదిన్నె, నదికైరవాడి నది తీరం నుంచి ఇసుక అక్రమ రవాణా
- అక్రమార్కులకు టీడీపీ నాయకుల అండదండలు
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు



నాగలదిన్నెలో తుంగభద్ర నదిలో ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న దృశ్యం

నందవరం: ఇసుకాసురులు పెట్రేగిపోతున్నారు. టీడీపీ నాయకుల అండదండలతో ఇసుక మాఫియాకు బ్రేకులు లేకుండా పోయాయి. అధికారులు కేవలం కుర్చీలకే పరిమితం కావడంతో యథేచ్ఛగా ఇసుక దందా సాగుతోంది. కళ్లెదుటే ఇసుక ట్రాక్టర్లు రయ్..రయ్ మంటూ తరలిపోతున్నా అధికారుల్లో చలనం కరువైంది. తూతూ మంత్రంగా తనిఖీలు చేయడం వదిలేయడం పరిపాటిగా మారింది. టన్నుల కొద్దీ ఇసుక తరలిపోతున్న ఇక్కడ చర్యలు శూన్యం.

రోజుకు 30 నుంచి 50 ట్రాక్టర్లు..

మండల పరిధిలోని నాగలదిన్నె, నదికై రవాడి గ్రామాలలో తుంగభద్ర నది ఒడ్డున ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. రోజుకు 30 నుంచి 50 ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం టీడీపీ నాయకులతో పాటు వారి అండ దండలతో ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఇసుక చోరులు ట్రిప్పు ఇసుక రూ.2,800 నుంచి రూ.4,000 వరకు అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు.

మండల కేంద్రం మీదుగా ఎమ్మిగనూరుకు..

మండల కేంద్రం నందవరం మీదుగా ఎమ్మిగనూరుకు అక్రమంగా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నదికై రవాడి గ్రామంలోని చిలక డోణ ఎత్తిపోతల పథకం రోడ్డులో తుంగభద్ర నది ఒడ్డుకు ఇసుక అక్రమంగా తరలించి.. అక్కడి నుంచి కొట్టాల, ఇబ్రహీంపురం, కల్లుదేవకుంట గ్రామాల మీదుగా, అలాగే కొట్టాల, మాచాపురం , నందవరం మీదుగా ఎమ్మిగనూరుకు తరలిస్తున్నారు. అయితే మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయ ఎదుట నుంచే అక్రమ రవాణా సాగుతోంది. అయినా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాగలదిన్నె నుంచి నదీతీర గ్రామాల వెంట ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. నాగలదిన్నె నుంచి ఎమ్మిగనూరు వైపు వెళ్లే ట్రాక్టర్లు నందవరం మీదుగా వెళ్తున్నాయి. మరొవైపు కనకవీడు, పేట, తిమ్మాపురం మీదుగా ఎమ్మిగనూరుకు ఇసుకను తరలిస్తున్నారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలు ఉన్నాయి.



నందవరం ప్రధాన రహదారిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

అక్రమంగా తరలిస్తే చర్యలు



ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక తరలించాలి. నిబంధనలు అతిక్రమిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. చర్యల్లో భాగంగా భారీ జరిమానాలను విధిస్తాం. అలాగే డ్రైవర్లు, ఓవనర్లపై కేసులు నమోదు చేస్తాం.
– తహసీల్దార్ శ్రీనివాసులు, నందవరం

తాగునీటి ఎద్దడి

నందిలో నుంచి ఇసుక తోడుకోవడం వల్ల మా గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దటి నెలకొనే పరిస్థితి. వేసవి దృష్ట్యా మా ఊరిలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది. అందులో ఇసుక మాఫియా ఇసుకను తరలించడంతో భూగర్భ జాలలు ఇంకిపోయే ప్రమాదం ఉంది. వేసవిలో ఇసుకలో చేతి బోర్లు వేసినా నీరు రావాడం లేదు. వేసవి దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య తలెత్తకుండా ఉన్నాతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి.
– లక్ష్మీదేవి, సర్పంచ్, నాగలదిన్నె

అధికారుల చర్యలు శూన్యం

అక్రమార్కులకు అధికార పార్టీ అండదండలు ఉండటంతో అధికారులు సైతం తల వంచుతున్నారు. ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టేందుకు వెనుకడుగు వేస్తున్నారు. కొందరు అధికారులు తొత్తులుగా మారి మాఫియాకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయాల ఎదుటే ట్రాక్టర్ల మోత మోగుతున్నా చెవిన పడటం లేదు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేపట్టి అధికారులు తక్కువ జరిమానాలు విధించడంతోనే యథాతథంగా ఇసుక మాఫియా పేట్రేగిపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారుల తీరును, ఇసుక మాఫియా ఆగడాలను చూసి ప్రజలు నివ్వెర పోతున్నారు. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఇంత జరుగుతున్న చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం. ఇసుక తరలింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వినతులకు వెంటనే పరిష్కారం చూపాలి



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల: ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వెంటనే పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఏయే సమస్యలపై ప్రజల నుంచి వినతులు వస్తున్నాయని తహసీల్దార్ కుమారస్వామిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా వేదికలో ఒకసారి వచ్చిన సమస్యపై మళ్లీ కంప్లైంట్ రాకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం గోనెగండ్లలో రీ సర్వే జరుగుతుంది. సర్వే చేసే పొలానికి సంబంధించిన రైతులకు ముందుగా నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలోనే సర్వే చేయాలన్నారు. సర్వేలో పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేయాలని సూచించారు. అలాగే రెవెన్యూ సంబంధించిన అంశాలపై సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో డీటీ విష్ణు ప్రసాద్, రీ సర్వే డీటీ శిరీష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ఆదోని రూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ సూచించారు. శనివారం ఆదోని పట్టణంలోని సబ్‌జైలును జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులోని ఖైదీల బరాక్స్, కిచెన్, రేషన్ స్టోర్‌ను పరిశీలించారు. భోజనాలు, వసతులు ఎలా ఉన్నాయో ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి తరఫున ఉచిత న్యాయవాదిని నియమిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఆనంద్, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ

నేటి నుంచి బండేగురిడి జాతర

నందవరం : పూలచింత గ్రామంలో వెలసిన సద్గురు బండేగురుడి 119వ జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ ఆరాధాన ఉత్సవాలు మఠం పీఠాధిపతి జయ శంకరప్ప స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఉప పీఠాధిపతి బండేగురుస్వామి తెలిపారు. ఆదివారం ఉదయం బండేగురు స్వామికి సుప్రభాత సేవ, రుద్రాభిషేకం వంటి విశిష్ట పూజలు గావిస్తారు. అనంతరం భక్తులకు అన్నదానం, మధ్యాహ్నం 2 గంటల నుంచి స్వామికి పల్లకీ, నంది కోల సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు కుంభోత్సవం నిర్వహించిన అనంతరం స్వామివారి రథోత్సవం చేపడతారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో భక్తులు రాత్రి అఖండ భజన కార్యక్రమం చేపడతారు.



బండేగురు స్వామి

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలకు

కౌతాళం : విద్యార్థులు ఇష్టంలో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎంపీడీఓ సుబ్బరాజు అన్నారు. మండల కేంద్రం కౌతాళంలో ప్రతిభ హైస్కూల్ శనివారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆదోని డివిజన్ ప్రవేట్ పాఠశాలల అసోషియేషన్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి , ఈఓఆర్డీ యోగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్‌కు 10వ తరగతి ఎంతో కీలకమైనదని, విజయానికి ఇది తొలిమెట్టు అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను మనస్ఫూర్తిగా వింటే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దూద్ బాషా, పాఠశాల కార్యదర్శి మెయినుద్దీన్, హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, సలహాదారుడు లక్షణాచారి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గోనెగండ్ల : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ అనంతసేన సూచించారు. స్వర్ణంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం గోనెగండ్ల, గంజిహళ్లి, బైలుప్పల గ్రామాల్లో సర్పంచులు, పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి, ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను బయట పారవేయకుండా తడి, పొడి చెత్తలను వేరువేసి డస్ట్ బిన్‌లలో వేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు వారికి అందివ్వాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సర్పంచులు హైమావతి,రాముడు పాల్గొన్నారు.

మంత్రాలయం పరిశుభ్రతకు సహకరించాలి

మంత్రాలయం : మంత్రాలయం పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య కోరారు. శనివారం మంత్రాలయంలో డీఎల్‌పీఓ నూర్జహాన్, పంచాయతీ ఈఓ నాగరాజు ఆధ్వర్యంలో చెత్తసేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. మంత్రాలయం చెత్తసేకరణ కేంద్రం ఏర్పాటు చేశామని, ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులచే చెత్త సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలందరూ చెత్త ఎక్కడబడితే అక్కడ వేయకుండా పంచాయతీ సిబ్బందికి అప్పగించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ప్రభావతి, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్ శెట్టి, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలి

పెద్దకడబూరు: అర్హులైన నిరుద్యోగులకు బీసీ కార్పొరేషన్ బ్యాంక్ రుణాలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దకడబూరు మండలంలో అర్హులైన బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు కాదని కూటమి ప్రభుత్వ నాయకులకు అనుకూలమైన వారికి రుణాలు అందించేలా కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బ్యాంక్ అధికారులు నిరుపేద అర్హులైన వారికి రుణాలు అందించేలా కృషి చేయాలని కోరారు.

మేధా శక్తి పెంచేలా బోధించాలి

కోసిగి: చిన్నారుల్లో మేధా శక్తిని పెంపొందించేలా బోధన చేయాలని ఎంఈఓ – 2 శోభారాణి సూచించారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నాల్గవ రోజు శిక్షణ కొనసాగింది. ఆమె మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి శిక్షణలో భాగంగా పిల్లలో మేధాశక్తి, సామాజిక స్పృహ పెంచాలన్నారు. ఇందుకోసం అంగన్ వాడీ కార్యకర్తలు సెంటర్‌లలో పిల్లలకు ఆట పాటలో కూడిన విద్యనందించాలన్నారు. ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్ కె.నరసయ్య, ఎన్. మనోహర్, ఈరన్న, ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ భాగ్య లక్ష్మీ బాయి, కాత్యాయినిలు శిక్షణ ఇచ్చారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం : మండలంలోని మాధవరం కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి నేతృత్వంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో కర్ణాటక నుంచి టాటా సుమో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుబడింది. కర్ణాటకకు చెందిన ఈడిగ వెంకటేశ్వర్లు (రాయచూర్), తిమ్మయ్య (రాజోలి)తో పాట దేవనకొండ మండలం తలమారి గ్రామానికి చెందిన నాగయ్య గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సుమోలో 30 బాక్సులు (2,880) టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.15 లక్షలు ఉంటుంది. నిందితులను ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డికి అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రాజేంద్ర, చెక్‌పోస్టు సీఐ చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

నోటీస్ బోర్డు

దరఖాస్తుల ఆహ్వానం

నందవరం : మండల పరిధిలోని ముగతి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులను ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు వివరించారు. దరఖాస్తులు www.cse. ap.gov.in లోగాని లేదా www. apms. ap.gov.in ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీ విద్యార్థులు, 2011 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఈ నెల 24 నుంచి మార్చి 31వ తేదీ లోసు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. ప్రవేశ పరీక్ష స్థానిక మోడల్ స్కూల్‌లో ఏప్రిల్ 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

కొత్త కూలి రేట్ల జీఓ విడుదల చేయాలి

ఆదోని రూరల్: సివిల్‌సప్‌లై హమాలీలకు పెంచిన కొత్త కూలి రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని సివిల్ సప్‌లై హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.నారాయణ, బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పెంచిన కూలీ రేట్లు రూ.25 నుంచి రూ.28కు సంబంధించిన జీవోను వెంటనే విడుదల చేయాలన్నారు. సివిల్‌సప్‌లై హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.వీరాంజనేయులు, బాబన్న, రామంజిని, వీరేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈ-శ్రామిక్ కార్డు తీసుకోవాలి

నందవరం : గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు అందరూ ఈ- శ్రామిక్ కార్డు తీసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. శనివారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో ఉపాధి పనులు, మస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఉపాధి కూలీలు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఈ- శ్రామిక్ కార్డును అందిస్తుందని, దీని ద్వారా కూలీలకు ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. ఈ శ్రామిక్ కార్డు పొందడంతో యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ రూ.2 లక్షలు, పూర్తి అంగవైకల్యానికి రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ వర్తింస్తుందన్నారు. ఎలాంటి రుసుము లేకుండా ఆధార్ కార్డు, జాబ్ కార్డుతో మీ సేవ, సీఈసీ సెంటర్లలో, ఆన్‌లైన్‌లో ఈ–శ్రామిక్ పోర్టల్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

పని దినాలు పెంచాం.. వలస వెళ్లొద్దు



బసలదొడ్డి గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజుస్వామి

పెద్దకడబూరు: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పని దినాలను 100 నుంచి 150కి పెంచినామని, ప్రజలు వలస వెళ్లకుండా గ్రామాలలోనే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగరాజుస్వామి అన్నారు. మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో చింతకుంట నుంచి రామ్‌రెడ్డి ఫీడర్ ఛానల్‌లో జరుగుతున్న ఉపాధి పనిని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడి మస్టర్లను తనిఖీ చేశాడు. ఆయన మాట్లాడుతూ వాటర్ స్టోరేజ్ (నీటి నిలువ) కోసం ప్రతి 10 మీటర్లకు ఒకటి చొప్పున గుంతలు తవ్వి నీరు నిలువ చేసుకునే విధంగా పనులు చేయాలని సూచించారు. జాబ్‌కార్డులు లేనివారికి త్వరలోనే కొత్త జాబ్‌కార్డులు కూడా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మీకాంత్, జి జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇటుక బట్టీలను తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసి జాతీయ రహదారిపై ప్రమాదాలకు కారణమవుతున్న ఇటుకల బట్టీలను సత్వరం తొలగించాలని ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర డిమాండ్ చేశారు. ప్రమాదాలకు కారణమవుతూ, కాలుష్యాన్ని వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్ కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- అభివృద్ధి పనులు ప్రారంభించకపోవడంపై సభ్యుల నిలదీత
- తోటి సభ్యులపై కౌన్సిలర్ లలితమ్మ వివాదాస్పద వ్యాఖ్యలు .. క్షమాపణ
- పూడికతీత పనుల్లో బిల్లుల స్వాహాపై చర్చ



కౌన్సిలర్ లలితమ్మ క్షమాపణ చెప్పాలని చైర్‌పర్సన్‌ను నిలదీస్తున్న పాలకవర్గ సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. సమస్యలపై పాలకవర్గ సభ్యులు, అధికారులు, చైర్మన్‌ను ప్రశ్నించారు. శనివారం కౌన్సిల్‌హాల్‌లో చైర్‌పర్సన్ శాంత ఆధ్వర్యంలో ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన టెండర్లు పిలవాలని, టెండర్లు పిలిచినా పనులు కొంతమంది కాంట్రాక్టర్లు ఎందుకు పనులు మొదలు పెట్టడంలేదని వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఫయాజ్, అశోక్, చలపతి తదితరులు చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. పనులు త్వరితగతిన ప్రారంభించడంలో కాంట్రాక్టర్లు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఎవరైనా వారికి పర్సంటేజీలు అడిగారా, లేక ఇతరత్రా కారణాలు ఏవైనా ఉన్నాయా వివరించాలని కోరారు. అలాంటిదేమీ లేదని కమిషనర్ ఎం.కృష్ణ సమాధానంగా చెప్పారు.

కౌన్సిల్ సభ్యులపై వివాదాస్పద వ్యాఖ్యలు..

ఆదోని మున్సిపాలిటీలో గుజిరి సామాన్లకు సంబంధించిన రికార్డులు ఎక్కడ ఉన్నాయి, ఏమయ్యాయంటూ మహిళా కౌన్సిలర్ లలితమ్మ అధికారులను ప్రశ్నించారు. ఫైల్‌కు సంబంధించిన వివరాలు చెప్పాలని పట్టుబట్టారు. తోటి పాలకవర్గ సభ్యులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, చలపతి, ఫయాజ్, రఘునాథ్‌రెడ్డి, ఇస్మాయిల్, రాజేశ్వర్‌రెడ్డి, మహిళా కౌన్సిలర్లు కలుగజేసుకొని.. తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో కౌన్సిల్ నుంచి ఆమెను సస్పెండ్ చేయాలని చైర్‌పర్సన్‌ను కోరారు. చైర్‌పర్సన్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. దీంతో మహిళా కౌన్సిలర్ లలితమ్మ చేసేదేమిలేక క్షమాపణ చెప్పారు.

పూడికతీత పనుల్లో అవకతవకలపై నిలదీత

పట్టణంలో పలు వార్డుల్లో పూడికతీత పనులు జరగకపోయినా జరిగినట్లు చిత్రీకరించి బిల్లులు స్వాహా చేసేందుకు యత్నించారని, ఇందుకు కారకులు ఎవరంటూ కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. అయితే తామేమీ బిల్లులు ఇవ్వలేదని, పనులు పూర్తి చేయకుండానే ఎలా బిల్లులు చెల్లిస్తారని కమిషనర్ సమాధానంగా చెప్పారు. అదేవిధంగా పూడికతీత పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తనదృష్టికి వచ్చిందని చైర్‌పర్సన్ శాంత తెలిపారు. పనులు పూర్తి అయిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. గర్ల్స్ హైస్కూల్ ఏరియాలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కౌన్సిలర్ ఎస్.పి.లక్ష్మీదేవి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తే శిక్ష తప్పదు



బెల్లం వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

ఆదోని రూరల్: సారా వ్యాపారులకు బెల్లం సరఫరా చేస్తే జైలు శిక్ష తప్పదని ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సైదుల్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో పట్టణంలోని బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అవసరమైన వారికి ఐదు కేజీల కంటే అధికంగా విక్రయించకూడదన్నారు. ఆధార్ కార్డులు సేకరించి వారి వివరాలను తీసుకోవాలని సూచించారు.

పది లీటర్ల నాటుసారా స్వాధీనం

నవోదయం 2.0లో భాగంగా శనివారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ శ్రీనివాసులు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

పొంచి ఉన్న ప్రమాదం



గుడేకల్ గ్రామంలో శిథిలమైన సిమెంట్ రోడ్డు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలోని సిమెంట్ రోడ్డు ఒక పక్క శిథిలమై ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రహదారిలో వాహనాలు, పత్తికొండకు వెళ్లే బస్సులు, ట్రాక్టర్లు, లారీలు తిరుగుతుంటాయి. దూరం ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు రోడ్డుపై పడిన గుంత కనపించకపోవడంతో అందులో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధితశాఖ అధికారులు స్పందించి శిథిలమైన చోట మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

సెలవు రోజుల్లోనూ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు

ఆదోని అర్బన్: ఈనెల విద్యుత్ బిల్లులు చెల్లించడానికి ఆదివారం, సెలవు రోజుల్లో కూడా విద్యుత్ వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 రోజులే ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెలవుల్లో కూడా వసూళ్ల కేంద్రాలు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.